

రంజాన్ వేళలు

	ఇఫ్తార్(గురువారం)	సహార్(శుక్రవారం)
కర్నూలు	6:36 (సాయంత్రం)	4:47 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:35 (సాయంత్రం)	4:42 (ఉదయం)
ఆదోని	6:38 (సాయంత్రం)	4:47 (ఉదయం)



కర్నూలు నగరంలోని సచివాలయంలో పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులు

వృద్ధులతో ఓట్లాట!

- ఇంటి వద్ద పింఛన్ పంపిణీ చేయాలన్న నిబంధనలు బేఖాతరు
- జిల్లాలో 2,46,865 ఫింఛన్లు
- బుధవారం 70 వేలకు పైగా పంపిణీ
- పింఛన్ రాదంటూ వైసీపీ 'దుష్ప్రచారం'

విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులు), సచివాయాలకు రావడానికి ఏమాత్రం చేతగానివారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, సైనిక, వితంతు పింఛనుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ అందజేయాలని సీఎస్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కలెక్టరు డాక్టర్ సృజన సైతం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం టెలీకాన్ఫరెన్స్‌లో ఇదే విషయాన్ని ప్రస్తావించి మార్గదర్శకాలు చేశారు. అయినా.. జిల్లాలో కొందరు సచివాలయం ఉద్యోగులు నిబంధనలను బేఖాతరుచేశారు. మరోవైపు తమను దూరం పెట్టారన్న ఆక్రోశంతో వలంటీర్లు, వైసీపీ నాయకులు 'ఇకపై ఇళ్లకు పింఛన్ రాదు..' అంటూ విష ప్రచారానికి తెరలేపారు. తద్వారా వృద్ధులకు పింఛన్లపై భయాందోళన కలిగేలా వైసీపీ పక్కా ప్లాన్ చేసింది. ఎన్నికల్లో ధైర్యంగా ఎదుర్కోలేక వైసీపీ అవ్వా తాతలతో ఓట్లాట.. ఆడుతుందోని సామాన్య ప్రజలతో పాటు రాజకీయ పార్టీల నాయకులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి)/కర్నూలు న్యూసిటీ

జిల్లాలో సామాజిక భద్రత కింద ఇస్తున్న వివిధ రకాల పింఛన్లు 25 మండలాల్లో 1.83,313 మందికి, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపాలిటీల్లో 63,550 కలిపి 2,46,863 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ రూ.73.91 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేవారు. అయితే ఎన్నికల షెడ్యూల్ రావడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. కొందరు వలంటీర్లు తాము ప్రభుత్వం ఖజానా నుంచి గౌరవవేతనం తీసుకుంటున్నామనే విజ్ఞతను మరిచి అధికార పార్టీ వైసీపీ కార్యకర్తలుగా మారారు. వైసీపీ నాయకులతో కలసి ఆ పార్టీ జెండాలు, ప్లకార్డులు, కరపత్రాలతో ఏకంగా ప్రచారం కూడా చేస్తున్నారు. దీనిని ప్రధాన ప్రతిపక్షం టీడీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు కూడా చేసింది. ఆరోపణలు నిజం కావడంతో జిల్లాలో పలువురు వలంటీర్లను సస్పెండ్ చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏప్రిల్ ఒకటో తేదీన ఇవ్వాల్సిన పింఛన్ పంపిణీకి వలంటీర్లను దూరం పెట్టాలని, ఎన్నికల ముగిసే వరకు వారికి ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు కూడా స్వాధీనం చేసుకోవాలని ఈసీ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల కమిషన్ నిర్ణయం వైసీపీ నాయకులు, వలంటీర్లకు ఏ మాత్రం మింగుడు పడడంలేదు. ఇంటికి పింఛన్ రాదంటూ ప్రచారం చేస్తున్నారు. ఇందుకు టీడీపీనే కారణం అంటూ నిందలు మోపుతున్నారు. సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చే అవకాశం ఉన్నా.. రాజకీయ దురుద్దేశంతో వీల్‌చైర్లపై దివ్యాంగులు, వృద్ధులను సచివాలయానికి తీసుకొస్తూ రాజకీయంగా లబ్ధిపొందాలనే కుట్రకు పాల్పడుతున్నారు వైసీపీ నాయకులు. వీటిని గమనించిన ప్రజలు ఓట్ల కోసం ఇంతగా దిగుజారుతారా..? అంటూ ప్రశ్నిస్తున్నారు.



మండుటెండలో పింఛన్ కోసం వెళ్తున్న వృద్ధుడు

● వృద్ధులతో వైసీపీ రాజకీయం

పింఛన్ కావాలంటే సచివాలయానికి రావాలంటూ సచివాలయ సిబ్బంది కొందరు లబ్ధిదారులకు ఫోన్లు చేసి చెబుతున్నారు. టీడీపీ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం వల్లే వలంటీర్లు ఒకటో తేదీన పింఛన్ ఇవ్వలేకపోయారని, వలంటీర్లు ఉంటే ఈ పరిస్థితి వచ్చేదా..? అంటూ అధికార పార్టీ నాయకులు కొందరు విష ప్రచారం చేయడం విమర్శలకు తావిస్తోంది. కొందరు వలంటీర్లు ఇళ్లకు వెళ్లి సచివాయాలకు వెళ్లకపోతే పింఛన్లు రద్దు అవుతాయంటూ సరికొత్త డ్రామాకు తెర తీశారు. దీంతో ఎక్కడ పింఛన్ రాదో అనే భయంతో నడవడానికి చేతకాని వాళ్లను సైతం సచివాయాలకు తీసుకొస్తున్నారు. కర్నూలు నగరంలో నడవలేని ఓ తండ్రిని కొడుకు ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వచ్చాడు. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని పింఛన్ కోసం మండుటెండల్లో ఆటోలో సచివాలయానికి తీసుకొచ్చారు. ఇలాంటి సంఘటనలు ప్రతివార్డులో కనిపించాయి. పత్తికొండలో ఓ వృద్ధురాలు స్టాండ్ సాయంతో సచివాలయానికి వచ్చారు. ఇదేమిటి అవ్వా..! ఇంటికే వచ్చి ఇస్తారు కాదని అంటే.. 'ఏమో నాయనా..! సచివాలయానికి రాకపోతే పింఛన్ రద్దు చేస్తారంట..' అని చెబితే వచ్చానని ఆవేదన వ్యక్తం చేసింది. దేవనకొండలో కూడా ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. ఇక్కడే కాదు.. జిల్లా అంతటా ఓ వర్గం రాజకీయ లబ్ధికోసం చేస్తున్న ప్రచారం వల్ల వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు తప్పడం లేదు. పలు సచివాయాలకు నగదు రావడం జాప్యం వల్ల పంపిణీ ఆలస్యం అయ్యింది.

● ఆయాసపడుతూ పింఛన్ కోసం...

కర్నూలు నగరంలోని కొత్తపేట సచివాలయానికి దివ్యాంగుడు మక్బూల్‌బాషా పింఛన్ కోసం వచ్చాడు. ఇదే ప్రాంతానికి చెందిన వృద్ధుడు ఖాజాహుస్సేన్ పింఛన్ కోసం సచివాలయానికి వచ్చాడు. గంటల తరబడి ఎదురుచూసినా పింఛన్ సొమ్ము ఇంకా రాలేదని సిబ్బంది చెప్పడంతో వారు నిరుత్సాహంతో వెనుతిరిగి వెళ్లాడు.



● సంకల్‌బాగ్ దగ్గర ఉన్న సచివాలయం వద్ద ఎస్‌ఆర్‌పేటకు చెందిన తిమ్మప్పకు ఆరోగ్యం బాగా లేకున్నా అతి కష్టంమీద సచివాలయానికి వచ్చాడు. అంత ప్రయాసపడి వచ్చినా ఆయనకు నిరాశే మిగిలింది. ఆయనకు సంబంధించిన సచివాలయం మిద్దెపై ఉండటంతో మెట్లు ఎక్కలేక కిందనే కూర్చున్నాడు. సచివాలయ సిబ్బంది కిందకి వచ్చి పింఛన్ ఇస్తామని చెప్పారు. అయితే తన కుమారుడితో సుమారు గంటసేపు కిందనే కూర్చున్నాడు. ఎంతసేపటికి సిబ్బంది రాకపోవడంతో చేసేదేమీ లేక వెనుతిరిగి వెళ్లారు.

● తొలి రోజు 70 వేల మందికి పంపిణీ

జిల్లాలో రూరల్, గ్రామీణ ప్రాంతాల్లో 2,46,865 మంది వివిధ రకాల పింఛన్‌దారులు ఉన్నారు. ప్రభుత్వం ఖరారు చేసిన విధివిధానాలు మేరకు సెర్ఫ్ సీఈఓ గతంలో ఇచ్చిన ఉత్తర్వులు సవరిస్తూ మార్గదర్శకాలు జారీ చేశారు. జిల్లా అంతటా 1090 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాయలంలో 8 మందికిపైగా సిబ్బంది పని చేస్తున్నారు. అంటే.. సగటున 8 వేల మంది సిబ్బంది ఉన్నారు. ఒక్కొక్కరికి 30-50 పింఛన్లకు మించి రావు. సిబ్బంది ప్రతిష్టాత్మకంగా తీసుకుంటే ఒక్క రోజులో పంపిణీ చేయవచ్చని అధికారులే అంటున్నారు. తొలి రోజు దాదాపు 70 వేల మందికి పంపిణీ చేశామని అధికారులు పేర్కొంటున్నారు.



ఆలూరు పట్టణంలో పింఛన్ల కోసం గుమికూడిన లబ్ధిదారులు

ఆ వర్గాలకు ఇంటి వద్దే పింఛన్

రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాల మేరకు సెర్ఫ్ సీఈఓ జారీ చేసిన ఆదేశాల మేరకు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నవారు, దివ్యాంగులు, వివిధ దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న పింఛన్‌దారులు, వితంతువుకుల ఇళ్లవద్దకు వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తారు. ఏ ఒక్కరు కూడా ఇబ్బంది పడకూడదు. నడవడానికి అవకాశం ఉన్న వాళ్లు మాత్రమే సచివాలయాలకు వచ్చి పింఛన్ తీసుకోవచ్చు. జిల్లాలో 2,46,865 మంది పింఛన్‌దారులు ఉంటే తొలి రోజు 70 వేల మందికి పైగా పంపిణీ చేశాం.

- సలీంబాషా, పీడీ, డీఆర్‌డీఏ, కర్నూలు

ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయండి

● కలెక్టర్ జి.సృజన



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 3: విభిన్న ప్రతిభావంతులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, అస్వస్థతతో ఉన్నవారు, మంచానికే పరిమితమైన వారు, నడవలేని స్థితిలో ఉన్నవారు, వృద్ధ మహిళలకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నడిచి రాగలిగేవారు, తక్కువ వయస్సు ఉన్న డప్పు కళాకారులు, ఒంటరి మహిళలకు మాత్రమే సచివాలయంలో పింఛన్ ఇవ్వాలని ఆదేశించారు. సచివాలయం దగ్గర పింఛన్ పంపిణీ సందర్భంగా షామియానా, కుర్చీలు వేయడంతో తాగునీటి వసతి కల్పించాలన్నారు. సచివాలయ సిబ్బంది మొత్తం ఫీల్డ్‌కు వెళ్లకుండా, కార్యాలయంలో మూడోవంతు సిబ్బంది అందుబాటులో ఉంటూ పింఛన్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. రెండు రోజుల్లో 95 శాతం పింఛన్ పంపిణీ పూర్తి కావాలన్నారు. ఏప్రిల్ 6వ తేదీ నాటికి వందశాతం పూర్తి కావాలని ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీపీవో నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహించాలి : ఆర్జేడీ

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: కర్నూలు నగరంలోని ఏ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షల మూల్యాంకనం శిబిరాన్ని బుధవారం కడప ఆర్జేడీ ఎ.రాఘవరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూల్యాంకనంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదన్నారు. పరీక్ష పిల్లల భవిష్యత్తుకు సంబంధించినదన్నారు. మార్కుల విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆర్జేడీని కలిసి సమస్యలను వివరించారు. ఆర్జేడీ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్, జిల్లా పరీక్షల పరిశీలకురాలు గీత తదితరులు ఉన్నారు.

నేటి నుంచి జేఈఈ-మెయిన్స్ పరీక్షలు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: దేశంలోని ప్రఖ్యాతి గాంచిన విద్యాసంస్థల్లో బీటెక్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ-మెయిన్స్ రెండో విడత ఆన్‌లైన్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. 12వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షల నిర్వహణకు అధకారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జేఈఈ-మెయిన్స్-2 పేపర్-1 బీఈ, బీటెక్ కోర్సులకు ఏప్రిల్ 4, 5, 6, 8, 9 తేదీల్లోనూ పేపర్-2 పరీక్ష 12వ తేదీన జరుగుతుంది. పేపర్-1 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష రెండు షిఫ్టుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుంది. పేపర్-2 పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కొనసాగుతుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ పరీక్ష కొనసాగుతుంది. కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని పట్టణాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఎల్‌పీ ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయండి: జేసీ

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 3: జిల్లాలో రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పీ (ల్యాండ్ పార్సిల్) నెంబర్ల ఆధారంగా భూములు రిజిస్ట్రేషన్ చేస్తామని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి మార్కెట్ విలువల నిర్ధారణ కమిటీతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రీసర్వే జరిగిన గ్రామాల్లో కొత్తగా అమలులోకి వచ్చిన ఎల్‌పీ (ల్యాండ్ పార్సిల్) నెంబర్లకు ప్రస్తుతం సర్వే నెంబర్లను మార్కెట్ భూముల విలువలతో మ్యాపింగ్ చేశామన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావు, కుడా వైస్ ఛైర్మన్ ప్రతాప్ రెడ్డి, సబ్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

ధరలన్నీ పాతాళానికి..

● రైతులు కన్నీరు మున్నీరు



మార్కెట్‌యార్డుకు వచ్చిన వేరుశనగ

కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 3: కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు విక్రయానికి తెచ్చిన వివిధ పంట ఉత్పత్తుల ధరలన్నీ పూర్తిగా పడిపోయాయి. ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు, ఇంకో వైపు తెగుళ్లతో దిగుబడులు భారీగా తగ్గిపోయాయి. చేతికి అందిన కొద్దిపాటి దిగుబడులకు కూడా కర్నూలు మార్కెట్ యార్డులో బుధవారం ధరలు పూర్తిగా పడిపోయాయి. వేరుశనగ కాయలు 929 క్వింటాళ్లు విక్రయానికి తెచ్చారు. గరిష్ఠ ధర రూ.7,081, మధ్యస్థ ధర రూ.6,692, కనిష్ఠ ధర దారుణంగా రూ.3,501 మాత్రమే రైతులకు దక్కింది. వాము ధర గతంలో రూ.30వేలకు పైగా ఉండగా.. ప్రస్తుత గరిష్ఠ ధర రూ.20,750, మధ్యస్థ ధర రూ.13,888, కనిష్ఠ ధర రూ.5,800 మాత్రమే రైతుల చేతికి వచ్చింది. మొక్కజొన్నలు క్వింటానికి గరిష్ఠ ధర రూ.2,149, మధ్యస్థ ధర రూ.2,077, కనిష్ఠ ధర రూ.1,958 మాత్రమే పలికింది. కందులపై మాత్రం కొంత ఊరట కలిగేలా ధర రైతులకు దక్కింది. గరిష్ఠ ధర రూ.10,189లు, మధ్యస్థ ధర రూ.10,169లు, కనిష్ఠ ధర ఘోరంగా రూ.1,456 మాత్రమే దక్కింది. శనగలకు గరిష్ఠ ధర రూ.5,739, మధ్యస్థ ధర రూ.5,630, కనిష్ఠ ధర రూ.2,510 రైతులకు దక్కింది. ఉల్లిగడ్డలు మొదటి నుంచి రైతులకు నిరాశనే మిగిల్చింది. మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున వ్యాపారులు దిగుమతి చేసుకుంటుండటంతో ఉమ్మడి జిల్లాలో రైతులకు ఉల్లి పంట సాగు ఏ మాత్రం సంతోషాన్ని ఇవ్వడం లేదు. గరిష్ఠ ధర రూ.1,369, మధ్యస్థ ధర రూ.1,279, కనిష్ఠ ధర కేవలం రూ.325 మాత్రమే దక్కింది. ఎండుమిరపకాయల రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. రోజురోజుకు ధర తగ్గడంతో రైతులకు ఎండుమిర్చిపై అప్పులు తప్ప.. లాభం ఏ మాత్రం అందని పరిస్థితి నెలకొంది. గరిష్ఠ ధర రూ.14,519, మధ్యస్థ ధర రూ.5,599, కనిష్ఠ ధర రూ.1,099 మాత్రమే రైతులకు దక్కింది.

ఏఆర్‌టీ క్లీనిక్‌లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

● కర్నూలులో ప్రైవేటు హాస్పిటళ్ల తనిఖీ




సీఎస్ హాస్పిటల్‌లో స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో, కర్నూలు జీజీహెచ్ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 3: నగరంలోని గాయత్రి ఎస్టేట్, బిర్లాగేటు సమీపంలో ఉన్న అసిస్టెక్, రిప్రొడెక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) క్లీనిక్ ప్రైవేటు హాస్పిటల్స్‌ను డీఎంహెచ్‌వో డా.ప్రవీణ్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. అశ్విని ఆసుపత్రి అమృత హాస్పిటల్, సీఎస్ హాస్పిటల్స్‌లను, ఏఆర్‌టీ క్లినిక్స్‌ల రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా.. పీసీపీఎన్‌డీటీ జిల్లా స్థాయి తనిఖీ బృందం, డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఫెర్టిలిటీ కేంద్రాలు ఇక నుంచి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, దీని కోసం ఏఆర్‌టీ నేషనల్ పోర్టల్‌లో అప్లికేషన్‌ను పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో తెలిపారు. దరఖాస్తును పూర్తి చేసి ప్రింట్ తీసి ప్రతి పేజీలో సంతకం, సీల్ వేసి ప్రభుత్వం నిర్దేశించిన మొత్తం బ్యాంకు డీడీని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఏఆర్‌టీ క్లీనిక్ లెవల్-1 (50వేలు), లెవల్-2 (2లక్షలు), ఏఆర్‌టీ బ్యాంకు 50వేలు సరోగసి క్లీనిక్ రూ.2 లక్షలను డిస్ట్రిక్ట్ అప్రాప్రియేట్ అథారిటీ (ఏఆర్‌టీ అండ్ సరోగసి యాక్ట్) మరియు డీఎంహెచ్‌వో కర్నూలు పేరు అప్లికేషన్ పూర్తి చేసి కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఈ దరఖాస్తు తర్వాత జిల్లా స్థాయిలో తనిఖీ టీమ్ పరిశీలించి తర్వాత జిల్లా స్థాయి కమిటీ ఆమోదం ఇచ్చి అర్హత కలిగిన కేంద్రాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు. ఈ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను 5 సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలని ఆదేశించారు. తనిఖీలో కర్నూలు జీజీహెచ్ గైనకాలజి, రేడియాలజి ప్రొఫెసర్లు శ్రీలక్ష్మి, రాధారాణి, ఎన్‌జీవో ప్రతినిధి ఐఎంఏ నాయకులు బాలమద్దయ్య, ఏఆర్‌టీ క్లీనిక్ గైనకాలజిస్టులు ప్రమీల, విజయలక్ష్మి, శ్రావ్య, రాజశేఖర్, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో ఎండప్రచండం

- 41 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత



నిర్మానుష్యంగా కనిపిస్తున్న ఎమ్మిగనూరులోని కమిటీ సర్కిల్

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 3: రోజు రోజుకు ఎండలు తీవ్రతరం అవుతున్నాయి.. దీంతో పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉదయం 10గంటలు దాటిన తరువాత ఇంటినుంచి బయటకు రావాలంటే జనం భయపడుతున్నారు. బుదవారం ఎమ్మిగనూరు పట్టణంలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు జన సంచారం లేక నిర్మానుష్యంగా కనిపించాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎండ వేడిమి ఒకే విధంగా ఉంది. దీంతో వీధులన్నీ ఖాళీగా కనిపించాయి. వివిధ పనుల నిమిత్తం ఎమ్మిగనూరుకు వచ్చిన ప్రజలు ఎండవేడిమి తాళలేక రహదారుల పక్కనున్న చెట్లకింద, నీడ ఉన్న ప్రాంతాల్లో సేదతీరుతూ కనిపించారు. ప్రజలు ఎండను తట్టుకోలేక కొబ్బరి బోండాలు, పళ్లరసాలు, చెరకు రసం, లస్సీ, మజ్జిగ వంటి వాటిని తాగుతూ కనిపించారు.



కొబ్బరి నీళ్లు తాగుతున్న చిన్నారులు

తెలంగాణ పోలీసుల వింత వాదన

-మాండ్ర శివానందరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు ఏప్రిల్ 3: తన భార్య, కుమారులను అరెస్టు చేయలేదని, కేవలం 41(ఎ) నోటీసులు ఇచ్చేందుకే సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చామని తెలంగాణ పోలీసులు వింత సమాధానం చెబుతున్నారని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. బుధవారం నందికొట్కూరు టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధం లేని కేసులో తన భార్య ఉమాదేవి, కుమారుడు కనిష్కను అక్రమంగా అరెస్టు చేసి ఇప్పుడు కేవలం 41(ఎ) నోటీసులు ఇచ్చేందుకే సీసీఎస్‌కు తీసుకొచ్చామని అబద్ధాలు చెప్పడం ఏమిటన్నారు. అక్రమంగా అరెస్టు చేయడానికి వచ్చిన సీసీఎస్ పోలీసులపై హైకోర్టులో కేసు వేశామన్నారు. కేవలం తెలంగాణ సీపీ తనపై ఉన్న కక్షతోనే సంబంధంలేని కేసులో తనను, తన కుటుంబ సభ్యులను లాగుతున్నాడన్నారు. అందులో భాగంగానే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సీసీఎస్ పోలీసులు ఎలాంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేసేందుకు ప్రయత్నించారన్నారు. నోటీసులు ఇస్తే సహకరిస్తామని చెప్పడంతో అల్లూరు నుంచి వెళ్లి పోయారన్నారు. ఈ కేసుతో తమ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని మాండ్ర శివానందరెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నందికొట్కూరు నియోజకవర్గ అభ్యర్థి జయసూర్య, నాయకులు షకీల్ అహ్మద్, ముర్తుజావలి, లాయర్ జాకీర్, గని తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతకంగా మారిన సాహస చర్య

గుండు ఎత్తే సమయంలో ప్రమాదవశాత్తు యువకుడి మృతి

బేతంచెర్ల, ఏప్రిల్ 3: మండలంలోని అంబాపురం గ్రామానికి చెందిన యాదగిరి వీరేష్ (24) మంగళవారం రాత్రి గ్రామంలో జరిగిన మురళి అనే వ్యక్తి పెళ్లి ఊరేగింపులో గుండు ఎత్తబోయి ప్రమాదవశాత్తు అది మీద పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన మల్లికార్జున కుమారుడు యాదగిరి వీరేష్ వలంటీర్‌గా పని చేస్తున్నాడు. తన కళ్ల ముందే గుండు మీద పడి కొడుకు మృతి చెందడం పట్ల తండ్రి కన్నీటి పర్యంతమయ్యాడు. పెళ్లిలో చోటు చేసుకున్న విషాదం గ్రామస్థులను సైతం విషాదంలో ముంచింది.

కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పాలన అవసరం

● డీసీసీ అధ్యక్షుడు బాబురావు



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న డీసీసీ బాబురావు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 3: కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పాలన రావాల్సిన అవసరం ఉందని డీసీసీ ఆధ్యక్షుడు కే. బాబు రావు అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోలేక, పార్టీ ఆర్థిక మూలాలు దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పీసీసీ ఆధ్యక్షురాలు షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసేందుకు 1500 మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ప్రస్తుతం 114 అసెంబ్లీ, 5 పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను అధిష్ఠానం ప్రకటించిందని అన్నారు. కర్నూలు పార్లమెంట్ స్థానానికి పీజీ రాంపుల్లయ్య యాదవ్, కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గానికి పరిగెల మురళీకృష్ణ పేర్లను ప్రకటించిందని అన్నారు. ఈ సమావేశంలో ప్రణాళిక కమిటీ చైర్మన్ రామస్వామి, కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ, డీసీసీ ఉపాధ్యక్షుడు బీ. బ్రతుకన్న, లాజరస్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 3: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ రీ వాల్యూయేషన్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. 2964 మంది పరీక్షలకు హాజరు కాగ 770 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

వెండి ఆభరణాలు సీజ్

● నిందితుడు అరెస్టు

బేతంచెర్ల, ఏప్రిల్ 3: బేతంచెర్ల బస్టాండులో తనిఖీలు చేస్తుండగా కర్నూలు నగరానికి చెందిన ఎస్ఎస్ అంబాషా అనే బంగారు వ్యాపారి వద్ద నుంచి సుమారు 2.36 కేజీల వెండి ఆభరణాలను, గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన టి. నాగరాజు నుంచి 148.14 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.83వేల నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రూ.50వేలకు పైగా ఎటువంటి బిల్లులు లేకుండా బంగారు, వెండి ఆభరణాలను తీసుకెళ్లడం ఎన్నికల నియామవళి ఉల్లంఘన కింద వస్తుందని సీఐ అన్నారు.

రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్

-అవయవ దానంతో పలువురికి జీవితం



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 3: ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడ్డాడు. వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఔదార్యంతో ఆ యువకుడి అవయవాలను దానం చేసి మరి కొందరికి ప్రాణం పోయడానికి సిద్ధమయ్యారు. ఈ సంఘటన బుధవారం జరిగింది. ఆత్మకూరు మండలం కొత్తరామాపురం గ్రామానికి చెందిన కలుగొట్ల ప్రవీణ్ కుమార్ (28) అతని సోదరుడు రాఘవ బైక్‌పై ఆదివారం ఆత్మకూరుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రహదారి గుంతల వల్ల బైక్‌పై వెనుక కూర్చున్న ప్రవీణ్ కుమార్ కింద పడ్డాడు. తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. బాధితుడ్ని ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా కోలుకోకపోవడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి వైద్యులు ప్రవీణ్‌కుమార్‌ని బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. దీంతో అతడి కుటుంబ సభ్యులు ప్రవీణ్ అవయవాలను దానం చేయాలని వైద్యులను కోరారు. వైద్యులు ప్రవీణ్ అవయవాలను సేకరించి పలువురికి దానం చేశారు. మృతునికి భార్య ప్రవల్లిక, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

శిథిల గోదాములు



నిరుపయోగంగా ఉన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధీనంలోని గోదాములు

ఈ ఫోటోలో కనిపిస్తున్నది రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాము. ఇప్పుడు దాన్ని వ్యాపారులకు అద్దెకిచ్చారు. ఐదేళ్లుగా మరమ్మతు చేయకపోవడంతో రైతులు దీనిలో పంట ఉత్పత్తులు నిల్వ చేసుకోవడం లేదు. ఎంతో కొంత ఆదాయం రాబట్టాలని అధికారులు దీన్ని తక్కువ అద్దెకు వ్యాపారులకు ఇచ్చారు. కేవలం 5 నుంచి 10 కోట్ల రూపాయలు ఖర్చు పెడితే.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాముల్లో రైతులు తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకుని లాభపడేవారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం లేదు.

- ● గత టీడీపీ హయాంలో కళకళ.. ప్రస్తుతం వెలవెల..
- ● మరమ్మతులపట్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- ● ప్రైవేటు గోదాములకు పంట ఉత్పత్తులను తరలిస్తున్న రైతులు
- ● గోదాములను వ్యాపారులకు అద్దెకు ఇచ్చేసిన అధికారులు

కర్నూలు (అగ్రికల్చర్), ఏప్రిల్ 3 : పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేనపుడు రైతులు వాటిని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాముల్లో దాచుకొనేవారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రూ.50 కోట్లు ఖర్చు చేసి ఈ గోదాములను నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణను పట్టించుకోలేదు. గత ఐదేళ్లుగా రైతులు ఈ గోదాముల్లో పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం కోల్పోయారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాములను రిపేరి చేసేందుకు స్థానిక అధికారులు రూ.10 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఇప్పటి దాకా నిధులు మంజూరు చేయలేదు. అరకొరగా.. నిధులు మంజూరైనా వాటితో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయలేని పరిస్థితి నెలకొంది. మూడు సంవత్సరాలుగా పౌర సరఫరాల సంస్థ అధికారులు కూడా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాముల్లో బియ్యాన్ని నిల్వ చేసేందుకు ఇష్టం చూపడం లేదు. ఆ శాఖ అధికారులు కూడా ప్రైవేటు గోదాములకు బియ్యాన్ని తరలిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ గోదాముల్లో పేదల బియ్యం నిల్వ చేస్తే పాడవుతాయని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ షర్మిలతెలిపారు.

● రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాముల్లో దుస్థితి

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలు తమ పంటల ఉత్పత్తులను తక్కువ ధరకే ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో నిల్వ చేసుకొనేవారు. మార్కెట్‌లో మద్దతు ధర వచ్చాక అమ్ముకొనేవారు. వైసీపీ పాలనలో ఈ సంస్థ గోదాములు శిథిలావస్థకు చేరినా మరమ్మతులకు ప్రభుత్వం పైసా కూడా విడుదల చేయలేదు. ఈ పరిస్థితుల్లో కర్నూలు నగరంలోని ఇందిరాగాంధీనగర్ సమీపంలో ఉన్న గోదాములను సంచుల వ్యాపారులకు, వివిధ రకాల వస్తువులు విక్రయించే వ్యాపారులకు అద్దెకు ఇచ్చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో ఎస్‌డబ్ల్యూసీ సంస్థకు ఆళ్లగడ్డ, డోన్, కర్నూలులో గోదాములు ఉన్నాయి. ఆళ్లగడ్డలో 11వేల మెట్రిక్ టన్నులు నిల్వ చేసే గోదాములు ఉండగా.. డోన్‌లో 2,100 మెట్రిక్ టన్నులు సామర్థ్యం ఉన్న గోదాములు కర్నూలు నగరంలో 13,700 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునే గోదాములు ఉన్నాయి. ప్రస్తుతం ఈ గోదాముల్లో రైతులు పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. రైతులు పంట ఉత్పత్తులను ఈ గోదాముల్లో నిల్వ చేసుకుంటే క్వింటానికి రూ.6.50 మాత్రమే చెల్లించాలి. ఈ సౌకర్యంతో పాటు 30 శాతం రిబేట్‌ను కూడా ప్రభుత్వం అందిస్తోంది. మరోవైపు రైతులు తమ అవసరాలను తీర్చుకునేందుకు పంట ఉత్పత్తులను బ్యాంకుల్లో కుదువపెట్టి 70 నుంచి 80 శాతం దాకా రుణాన్ని పొందేందుకు అవసరమైన ధృవీకరణ పత్రాన్ని కూడా ఎస్‌డబ్ల్యూసీ సంస్థ అధికారులు జారీ చేస్తున్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో రూ. కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన గోదాములు ప్రస్తుతం నిరుపయోగంగా ఉండటం వల్ల పంట ఉత్పత్తులను రైతులు ప్రైవేటు గోదాములకు మరలించి క్వింటానికి రూ.12 ప్రకారం అద్దె చెల్లిస్తున్నారు.



రైతు సేవలు దూరమై వ్యాపారులకు నిలయంగా మారిన గోదాములు

గోదాములకు రూ.200 కోట్లు ఖర్చు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఏ మాత్రం గిట్టుబాటు కాని పరిస్థితుల్లో ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి నాబార్డు ద్వారా దాదాపు రూ.200 కోట్లు ఖర్చు చేసి గ్రామాల్లోని నిర్జన ప్రదేశాల్లో గోదాములను పూర్తి చేస్తున్నది. ఈ గోదాముల నిర్వహణ కష్టమని, ఈ మారుమూల ప్రాంతాల్లోని గోదాముల్లో రైతుల పంట ఉత్పత్తులను నిల్వ చేస్తే భద్రత కల్పించడం వీలుకాదని అధికారులు చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా రూ.200 కోట్ల ఖర్చుతో వాటిని నిర్మిస్తున్నది.

● ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో భద్రత లేదు.

గతంలో సివిల్ సప్లయ్ సంస్థ ద్వారా పేదలకు పంచే బియ్యాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాముల్లో నిల్వ చేస్తుండేవాళ్లం. ఆ గోదాములు శిథిలావస్థకు చేరడంతో అక్కడ పేదల బియ్యానికి భద్రత లేకుండా పోయింది. ప్రైవేటు గోదాముల్లో బియ్యాన్ని నిల్వ చేస్తున్నాం.

- షర్మిల, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్

ఆదాయం కోసం గోదాములను వ్యాపారులకు ఇస్తున్నాం



ఎస్‌డబ్ల్యూసీ ఆధ్వర్యంలోని గోదాములు కొంత మేరకు శిథిలావస్థకు చేరాయి. వాటికి మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. వివిధ కారణాల వల్ల ఈ గోదాముల్లో సివిల్ సప్లయ్ అధికారులు బియ్యాన్ని నిల్వ చేయడం లేదు. అందుకని మేం కొన్ని గోదాములను వ్యాపారులకు అద్దెకు ఇచ్చాం.

● - ఆంజనేయులు, ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్

సీఐని సస్పెండ్ చేయాలి

● ఎస్పీని కలిసిన టీడీపీ అభ్యర్థి టీజీ భరత్



ఎస్పీను కలిసేందుకు వస్తున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 3: తమ పార్టీ నేతలను కొట్టిన సీఐ ఆదినారాయణ రెడ్డిని సస్పెండ్ చేయాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్పీని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జి అర్షద్‌లతో కలిసి ఆయన ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి సీఐ ఫోన్ చేసి పీఎస్ మీటింగ్‌కు రావాలంటూ 8 వార్డు టీడీపీ కార్పొరేటర్ పరమేష్, సీనియర్ నాయకుడు శేషగిరి శెట్టి, శ్రీకాంత్‌లను పిలిపించారన్నారు. అక్కడి నుంచి వారిని జగన్నాథ గట్టు మీద పోలీసు శిక్షణ కేంద్రానికి తీసుకెళ్లి బూతులు తిడుతూ కొట్టారని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో మద్దతు పెరుగుతోందన్న ఉద్దేశంతోనే కావాలని టార్గెట్ చేసి వీరిని కొట్టారని తెలిపారు. ఇందుకు కారణమైన సీఐ ఆదినారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. ఈ విషయంలో తమకు న్యాయం జరగని పక్షంలో ఎన్నికల కమిషన్‌ను, హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ విషయంలో విచారణ జరుపుతామని ఎస్పీ హామీ ఇచ్చారన్నారు. జనసేన ఇన్‌చార్జి అర్షద్ మాట్లాడుతూ టీడీపీ నేలతపై దాడి జరిగిన రోజును చీకటి రోజుగా పేర్కొన్నారు.

ప్రైవేట్ కేసులు వేస్తాం



టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి, కార్పొరేటర్ పరమేష్, సీనియర్ నాయకుడు శేషగిరి శెట్టిని పోలీసులు వేధించిన పోలీసులపై ప్రైవేట్ కేసులు వేస్తామని టీడీపీ జిల్లా ఆధ్యక్షులు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలతో మమేకమై పని చేసే టీడీపీ నాయకులను ఎట్లా కొడతారని ప్రశ్నించారు. అధికార వైసీపీ నాయకులు చెప్పినట్లు పోలీసులు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ వారిని వేధిస్తున్నారని అన్నారు. ఈ ఘటనపై డీజీపీ, జిల్లా, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

మిస్టరీగా రక్తపు మరకలు

- ● పోలీసు జాగిలాన్ని ఉపయోగించినా ఫలితం శూన్యం
- ● రక్తపు మరకలపై పలు అనుమానాలు...
- ● కేసు నీరుగారుస్తున్నారంటూ ఆరోపణలు

ఆదోని/ఆస్పరి, ఏప్రిల్ 3: ఆస్పరిలోని ఓ బొరుగుల బట్టీ, చర్చి, కస్తూర్బా పాఠశాల సమీపంలో మార్చి 25న రక్తపు మరకలు కనిపించడం ఇప్పటికీ అంతు తేలని మిస్టరీగానే ఉండిపోయింది. ఎవరినైనా హత్య చేసి, గుట్టుచప్పుడు కాకుండా అక్కడి నుండి తరలించారా...? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆస్పరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. పోలీసు జాగిలాలను పిలిపించి తనిఖీ చేశారు. పోలీసు జాగిలం చర్చి ఆవరణ అంతా తిరిగి జడ్పీ హైస్కూల్ ఆవరణలోకి వెళ్లి, ఆ తరువాత కస్తూర్బా పాఠశాల దగ్గరకు వెళ్లి ఆగిపోయింది. ఆ తరువాత పోలీసులు విచారణ చేపట్టారు. ఆ విచారణలో ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించి వారం రోజులు పైనే గడుస్తున్నా... ఈ ఉదంతంపై పోలీసులు ఎలాంటి వివరాలు వెల్లడించకపోవడం వెనుక రాజకీయ ప్రమేయం ఏమైనా ఉందా...? అనే అనుమానం తలెత్తింది.



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)



చర్చి వెనుక భాగాన రక్తపు మరకలు

● క్లూ దొరకలేదు... - హనుమంతప్ప, సీఐ, ఆస్పరి

బొరుగుల బట్టీ దగ్గర రక్తం ఎక్కువగానే పడి ఉంది. అనుమానంతోనే క్లూస్ టీం, పోలీసుల జాగిలాన్ని రప్పించాం. అక్కడ ఉన్న బ్లడ్ శాంపిల్స్ కూడా సేకరించాం. పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నాం.

గోల్‌మాల్..!

- ● కరస్పాండెంట్లు, గెస్ట్ ఫ్యాకల్టీలకూ అవకాశం
- ● ఆర్‌యూ బీఈడీ మోడరేషన్ బోర్డులో గందరగోళం
- ● కంట్రోలర్‌పై చర్యల కోసం విద్యార్థి సంఘాల పట్టు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 3: రాయలసీమ యూనివర్సిటీకి అనుబంధంగా 39 బీఈడీ కళాశాలలు ఉండగా 2022-24 విద్యా సంవత్సరానికి గాను రెండవ సెమిస్టర్ రికార్డుల వెరిఫికేషన్(మాడరేషన్ బోర్డు)కు గతనెల 12న యూనివర్సిటీ పరీక్షల విభాగం బీఈడీ కళాశాలకు నోటీఫికేషన్ జారీ చేశారు. పీహెచ్‌డీతో పాటు 15 సంవత్సరాల టీచింగ్ అనుభవం ఉన్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అందులో పేర్కొన్నారు. కానీ యూనివర్సిటీ పరీక్షల విభాగం కొన్ని కళాశాలల అధ్యాపకుల పేర్లను అర్హత లేకపోయినా మోడరేషన్ బోర్డుకు పంపించారు. వాటి ఆధారంగానే పరీక్షల అధికారి తమకు అనుకూలమైన వ్యక్తుల పేర్లను ఎంపిక చేసుకుని నిబంధనలు పాటించకుండా సభ్యులను ఎంపిక చేసినట్లు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అవకతవకలు ఇలా..

● సిల్వర్ జూబ్లీ కళాశాలలో ముగ్గురు గెస్టు ఫ్యాకల్టీగా పని చేస్తున్న వారికి మోడరేషన్ బోర్డులో సభ్యులుగా తీసుకున్నట్లు ఆరోపణ.

● సిల్వర్ జూబ్లీ కళాశాలలో పని చేస్తున్న శరత్‌బాబు



ఎమ్మిగనూరు పట్టణంలోని మదర్ థెరిస్సా బీఈడీ కళాశాలలో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. అయినప్పటికీ నిబంధనలకు వ్యతిరేకంగా ఆయనకు అవకాశం కల్పించారు.

● డాక్టర్ వినోద్‌కుమార్ కోడుమూరులోని ఠాగూర్ బీఈడీ కళాశాలలో కరస్పాండెంట్ ఉన్నారు. ఆయన పేరు కూడా మోడరేషన్ బోర్డులో సభ్యుడిగా ఎలా నియమిస్తారన్నది ప్రశ్నార్థకం.

● ఆళ్లగడ్డ పట్టణంలో ఒక కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ కర్నూలు నగరంలో మరోక కళాశాలలో ఆధ్యాపకుడిగా పని చేస్తూ ఒకే వ్యక్తికి రెండు చోట్ల పనిచేస్తున్న ఆయనకు అవకాశం ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.

● మోడరేషన్ బోర్డులో ఎంపికైన ముగ్గురు సభ్యులకు పీహెచ్‌డీ, 15 సంవత్సరాల అనుభవం లేకపోవడం గమనార్హం.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. విచారణ అనంతరం అర్హత లేని వారిని కమిటీ నుంచి తొలగించి అర్హులైన వారికి అవకాశం కల్పిస్తాం.

- బి.సుధీర్ ప్రేమ్ కుమార్, ఉపకులపతి, రాయలసీమ యూనివర్సిటీ



పింఛన్ కోసం పడిగాపులు


గూడూరులోని సచివాలయం వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

గూడూరు, ఏప్రిల్ 3: ఆందోళన వద్దు.. ఈనెల 3వ తేదీ నుంచి వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తామని అధికారులు వెల్లడించడంతో పింఛన్ కోసం సచివాలయాల దగ్గర లబ్ధిదారులు పడిగాపులు కాశారు. బుధవారం సచివాలయాల దగ్గర పింఛన్ పంపిణీ చేస్తారని అధికారులు వెల్లడించడంతో ఉదయాన్నే లబ్ధిదారులు అక్కడికి చేరుకున్నారు. సచివాలయాల వద్ద అధికారులు షామియానా టెంట్లు, కూర్చో వడానికి కుర్చీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం పింఛన్ డబ్బులు రావడంతో లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. మిగిలిన వారికి కూడా గురువారం పంపిణీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. నడవలేని వారికి, అనారోగ్యంతో ఉన్న వారికి ఇంటి దగ్గరనే పింఛన్ అందిస్తామని అధికారులు చెప్పారు.

2,652 పింఛన్ల పంపిణీ

కల్లూరు: కల్లూరు మండలంలో 2,652 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కల్లూరు మండలంలో మొత్తం 8,432 పింఛన్లు ఉండగా బుధవారం సాయంత్రం వరకు 32 శాతం 2652 మందికి పింఛన్లు అందజేసినట్లు ఆయన తెలిపారు. 6వ తేదీలోపు అర్హులందరికీ పింఛన్లు అందజేస్తామని స్పష్టం చేశారు.

పింఛన్లు పకడ్బందీగా పంపిణీ చేయండి

ఓర్వకల్లు, ఏప్రిల్ 3: మండలంలోని అన్ని గ్రామాల్లో పింఛన్లు పకడ్బందీగా పంపిణీ చేయాలని ఎంపీడీవో మల్లేశ్వరి సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో ఉన్న వలంటీర్లకు పింఛన్ల పంపిణీ బాధ్యత అప్పగించడం లేదన్నారు. గురువారం ఉదయం నుంచి గ్రామాల్లో ఉన్న సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేస్తారన్నారు.

కాంగ్రెస్‌కు పీసీసీ అధికార ప్రతినిధి రాజీనామా

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 3: కాంగ్రెస్ పార్టీకి పీసీసీ అధికార ప్రతినిధి కరుణాకర్ బాబు రాజీనామా చేశారు. బుధవారం పీసీసీ అధ్యక్షురాలికి తన రాజీనామా లేఖను పంపుతున్నట్లు కరుణాకర్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంత వరకు కాంగ్రెస్ పార్టీలో తనను ప్రోత్సహించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్క రించాలని కోరుతూ కడప ఆర్జేడీ వై.రాఘవరెడ్డికి జిల్లా ఫ్యాప్టో సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. బుధవారం జిల్లా ఫ్యాప్టో సంఘం నాయకులు కడప ఆర్జేడీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ ఎస్.గోకారి మాట్లాడుతూ గత సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ పదవ తరగతి మూల్యాంకన నిధులు ఇంత వరకు ఉపాధ్యాయులకు అందలేదని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షల నిర్వహణ నిధులు మూల్యాంకన నిధులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. విద్యాసంవత్సరం మధ్యలో వలసలు వెళ్లే విద్యార్థుల కోసం ప్రత్యేక మైన కార్యాచరణను రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో యుటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు యుఆర్‌పి రవికుమార్, నవీన్ పాటిల్, రాష్ట్ర బాధ్యుడు సురేష్ కుమార్, ఎస్టీయూ టీకే జనార్దన్, ఏపీటీఎఫ్ 257 అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగరాజు, రంగన్న, ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం పాల్గొన్నారు.

వైసీపీపై ప్రజల్లో విసుగు

పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 3: వైసీపీపై ప్రజలు విసుగు చెంది టీడీపీ కూటమికి పట్టం కట్టనున్నారని పాణ్యం టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 21వ వార్డు ఎన్జీవోస్ కాలనీలో ఆమె శంఖారావం, టీడీపీ సూపర్‌సిక్స్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని మ్యానిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉంటారన్నారు. వైసీపీ పాలనలో అంతా విధ్వంసమేనని జగన్‌రెడ్డిని ఓటుతో బుద్ధి చెప్పాలని ఆమె పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ ఇన్‌చార్జి పెరుగు పురుషోత్తంరెడ్డి, వార్డు ఇన్‌చార్జి రాఘవేంద్రారెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, వంగాల జనార్దన్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, కరీం, లోకేష్‌రెడ్డి, భరత్‌నాయక్, గంగాధర్‌గౌడ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.


సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న గౌరు చరిత

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి: జేసీ

కల్లూరు, ఏప్రిల్ 3: ఓటు హక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవా లని పాణ్యం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పిలుపునిచ్చారు. బుధవారం కల్లూరు మండలంలోని చిన్నకొట్టాల, పెద్దకొట్టాల, కె.మార్కాపురం, సల్కాపురం, పర్ల, నెరవాడ, పెద్దపాడు పోలింగ్ కేంద్రాల్లో వసతులు పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అన్నివర్గాల ప్రజలు ఓటుహక్కు వేసేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలైన కె.మార్కాపురం, పర్లలో ఓటర్లు ప్రశాంత వాతావ రణంలో ఓటువేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, వెలుగు ఏపీఓ శ్రీనివాసులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

కర్నూలు(కలెక్టరేట్): ఎన్నికల నిబంధనలు పాటించాలని పాణ్యం నియో జకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య రాజకీయ పార్టీలకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు లో పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాజకీయ పార్టీల తమ ప్రచార కార్యక్రమాలకు, హోర్డింగులకు అనుమతులు తప్పకుండా తీసుకోవాలన్నారు. నిర్దేశించిన వాహనాల కంటే ఎక్కువ వాహనాలు వినియోగించిన వాటి ఖర్చు సంబంధిత పార్టీలకు అభ్యర్థుల ఖర్చులుగా లెక్కిస్తామన్నారు. 85 సంవత్సరాలు పైబడ్డ వారు, అత్యవసర సర్వీసులలో పని చేసేవారు, రైల్వే ఉద్యోగులు, పీడబ్లూడీ, కోవిడ్‌తో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్లు, హోం ఓటింగ్‌పై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఏఈ ఆర్‌వోలు పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, కల్లూరు తహసీల్దార్లు ఫణికుమార్, జమానుల్లా ఖాన్, నటరాజు, మునివేలు, పాణ్యం ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సతీష్, పాణ్యం టీడీపీ, వైసీపీ, బీఎస్పీ నాయకులు ఛత్రపతిరెడ్డి, సురేష్, చిరంజీవి పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

జొహరాపురంలో అన్నీ సమస్యలే

భరోసా యాత్రలో టీజీ భరత్


ప్రజలతో మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 3: జొహరాపుంలో ఎటు వెళ్లినా ప్రజలు సమస్యలే చెబుతున్నారని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. బుధవారం జొహరాపురంలో దర్గా వీధి, సునీతా స్కూల్ లైన్లో టీజీ భరత్‌భరోసా యాత్ర నిర్వహించారు. ఇళ్లు, దుకాణాల వద్దకు వెళ్లి వృద్ధులు, మహిళలు, యువకులను కలిసి వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అమ్మఒడి అందడం లేదని, ఇల్లు పెద్దగా ఉందని పింఛన్ తీసేశారని ప్రజలు తమ బాధలు చెప్పుకున్నారు. వైసీపీ పాలనలో అర్హులకు పథకాలు అం దడం లేదని, సాకులు చూపుతూ సంక్షేమ పథకాలను తీసేస్తున్నారని మండి పడ్డారు.దోమల సమస్యల తీవ్రంగా ఉన్న జొహరాపురంలో అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు తెలిపారని టీజీ భరత్ అన్నారు. మోహన్, వెంకటయ్య, మాధవస్వామి, తిమ్మాజీ, శ్రీనివసగౌడ్, వెంకటేష్ గౌడ్, ఎల్లగౌడ్, ప్రతాప్, శాంతన్న, నాగరాజు, భాస్కర్, కోలుట్ల, తిమ్మప్ప, అబ్దుల్లా, శ్రీను, శాంతమ్మ, చెట్టెమ్మ, కుమార్, పనరీఖ్, ఆరీఫ్ పాల్గొన్నారు.

ఉద్యోగులపై చర్యలు తీసుకోండి : టీఎస్ఎఫ్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 3: రాయలసీమ యూనివర్సిటీలో అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఉపకులపతి బీ.సుధీర్ ప్రేమ్ కుమార్‌ను గిరిజన విద్యార్థి సమాఖ్య(టీఎస్ఎఫ్) కలిసి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలో ఉద్యోగులపై అనేక పిర్యాదులపై ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ సెక్రటరీ ప్రొఫెసర్ వై నజీర్ అహ్మద్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన ఇచ్చిన నివేదిక ఆధా రంగా 18 అంశాలకు సంబంధించి అందించారన్నారు. అప్పటి ఉపకులపతి ఏ. ఆనందరావు పలువురిని ఉద్యోగాల నుంచి తొలగించారు. ఇంకొంత మంది ఉద్యోగుల నుంచి భారీగా ముడుపులు తీసుకున్న అప్పటి ఉపకులపతి ఆనందరావుపై విచారణకు ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్య దర్శి వెంకటేష్, ముద్దుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన సేవలందించాలి


నర్సింగ్ సూపరింటెండెంట్‌కు కలిసిన హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు

కర్నూలు(హస్పిటల్), ఏప్రిల్ 3: రోగులకు నాణ్యమైన సేవలందించాలని నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్పీ సావిత్రిబాయి పేర్కొన్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కొత్తగా నర్సింగ్ సూపరింటెండెంట్ బాధ్యతలు చేపట్టిన ఎస్పీ సావిత్రీబాయికి ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ అభినందనలు తెలిపింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డి.మంజులాదేవి ఆధ్వర్యంలో సీనియర్ హెడ్ నర్సులు, రెగ్యులర్ స్టాఫ్ నర్సులు, నర్సింగ్ సూపరింటెండెంట్‌ను కలిశారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ నర్సులు జూనియర్ నర్సులకు పనులు నేర్పించాలని ఆదేశించారు. అలాగే రోగులకు మందులను ఇవ్వడంలో తేదీలను గమనించాలని, ఎక్స్‌పైరీ డేట్‌ను చూడాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ నర్సులు విమలమ్మ, పీజే మనోరంజిని, విజయమ్మ, ధనలక్ష్మి, రెగ్యులర్ స్టాఫ్ నర్సులు బద్రి విజయమ్మ, కళ్యాణి, వినోదిని, నాగేంద్రమ్మ, ఎన్‌జీ రేణుక పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్స్ ప్రజలకు తెలపాలి

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 3: ఎలక్టోరల్ బాండ్స్ ప్రజలకు తెలియకుండా బీజేపీ కుట్ర చేస్తుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. బుధవారం రోజా వీధిలో ఎన్‌ఆర్‌సీ, ఎన్‌పీఆర్, సీఏఏ అమలు రద్దు చేయాలని కోరుతూ సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా సుమలత మాట్లాడుతూ బీజేపీ దేశంలో హిందూ ఓట ర్లందరని ఒక వైపు తీసుకువచ్చేలా ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఎలక్టోరల్ బాండ్ల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే సీఏఏను ఆయుధంగా ప్రయోగిస్తుందన్నారు. కార్యక్రమంలో నసీమా, ఫాతిమా, పర్వీన్, గౌసియా, ముంతాజ్, షహనాజ్ పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: పాతబస్తీలోని పెద్దపడకానాకు చెందిన 8వ వార్డు టీడీపీ కార్పొరేటర్ కురవ పరమేష్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఆయనపై నానా దుర్భాషలాడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, కోశాధికారి కేసీ నాగన్న డిమాండ్ చేశారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అనసరంగా కురువ పరమేష్‌ను స్టేషన్‌కు పిలిపించి దుర్భాషలాడడం సరికాదన్నారు. ఈ విషయం పై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కురువ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తవుడు శ్రీనివాసులు, బి.రామక్రిష్ణ, బీసీ తిరుపాలు, పుల్లన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీడీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరు

గూడూరు, ఏప్రిల్ 3: టీడీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు అన్నారు. శుక్రవారం గూడూరులోని 10వ వార్డు కురుకుంద వీధి, కాపవీధి, వడ్లగేరిలో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్ళి బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటి కింద సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు మల్లాపు బుడ్డం గలి, కోడుమూరు షాషావలి, మాజీ కౌన్సిలర్ నరసింహులు, గౌండ కుమార్, విజయ్ కుమార్, హనుమంతు, నడిపన్న పాల్గొన్నారు.

టీడీపీని గెలిపిస్తే రాష్ట్రానికి భవిష్యతు

సి.బెళగల్, ఏప్రిల్ 3: తెలుగుదేశం పార్టీని గెలిపిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ సీనియర్ నాయకుడు మల్లికార్జునగౌడు అన్నారు. మండల కేంద్రమైన సి.బెళగల్‌లో ఎంపీటీసీ ఈరన్నగౌడు అధ్యక్షతన బుధవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు ధనుం జయుడు, సోమనాథ్‌గౌడు, బాలాజీ వెంకటేశ్వర్లు, నాగరత్నం, విష్ణుహమాలీ యూనియన్ నాయకుడు భీమన్న, నల్లన్న తాత, రాముడు, బాషా, గౌస్ పాల్గొన్నారు.

ఈత కొలనును వినియోగించుకోండి


టెంకాయ కొడుతున్న కలెక్టర్ జి. సృజన

కర్నూలు(స్పోర్ట్స్), ఏప్రిల్ 3: వేసవిలో కర్నూలు ప్రజలు, విద్యార్థులు డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈత కొలనను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం కలెక్టర్ కొలనులో పూజ చేసి ఈత కొలనను ప్రారంభించారు. స్విమ్మింగ్ పూల్ గురించి ఆరా తీశారు. 4వ తేదీ నుంచి చిన్నారులకు స్విమ్మర్లు అందుబాటులో ఉంచాలన్నారు. స్విమ్మర్లను తయారు చేయాలని డీఎస్‌డీవో భూపతిరావును కోచ్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈవో రమణ, కోచ్ నటరాజ్, శేషఫణి పాల్గొన్నారు.

షెడ్డుకు నిప్పుపెట్టిన దుండగులు

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 3: మండలంలోని వర్కూరులో ఓ రైతు పొలంలో ఏర్పాటు చేసుకున్న షెడ్డును గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. బాధిత రైతు తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన తలారి రామాంజేయులు గ్రామ శివారులో తనకున్న సొంత పొలంలో రేకుల షెడ్డును ఏర్పాటు చేసుకున్నాడు. అందులో డ్రిప్పు పైపులు, పీవీసీ పైపులు, విద్యుత్ సర్వీసు వైరు, వ్యవసాయ పరికరాలు ఉంచాడు. దాంతో పాటు కొన్ని నెలల కాలం నుంచి పూజా కలప సిద్ధం చేసి విక్రయిస్తున్నాడు. అయితే మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు షెడ్డు పక్కనే ఉంచిన కలపకు నిప్పు పెట్టారు. దీంతో మంటలు వ్యాపించి షెడ్డులో ఉంచిన పైపులు, కలప, విద్యుత్ వైరు కాలిపోయాయి. షెడ్డుకు ఏర్పాటు చేసిన నాపరాతి బండలు విరిగిపడ్డాయి. బుధవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు రామాంజనేయులు గమనించి లబోదిబోమన్నాడు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లిందని వాపోయాడు. ఏఎస్‌ఐ సురేంద్ర ఘటనాస్థలిని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.


కాలిపోయిన వస్తువులను చూపుతున్న బాధిత రైతు

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ఓర్వకల్లు, ఏప్రిల్ 3: పొలాల్లో వేసిన టవర్లతో నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని బుధవారం డిప్యూటీ తహసీల్దార్ పురు షోత్తంకు బుధవారం రైతులు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని హుశేనాపురం, ఉప్పలపాడు, కాల్వ, ఎన్.కొంతలపాడు, ఉయ్యాలవాడ, తదితర గ్రామాల్లో పొలాల్లో గ్రీన్‌కో విండ్ సంస్థ టవర్లను ఏర్పాటు చేసిందన్నారు. అయితే విద్యుత్ టవర్ల నిర్మాణంలో ఒక్కొక్కరికి ఒక్కో విధంగా నష్టపరిహారం చెల్లించారన్నారు. పొలాల్లో కరెంటు తీగలు వేశామని, నష్టపరిహారం ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. రైతుల నుంచి బ్యాంక్ అకౌంటు బుక్స్, పాసుబుక్స్ ఇప్పించుకునారే తప్ప నష్టపరిహారం ఇవ్వలేదని డీటీకి వివరిం చారు. బాధిత రైతులు ఫక్కీరయ్య, వెంకటసుబ్బన్న, సాయిచ రణ్, మునిరెడ్డి, మనోహర్, శర్మ, వెంకటేశ్వర్లు, మనోహర్ శర్మ పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయండి

ఓర్వకల్లు, ఏప్రిల్ 3: త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సోదరుడు బైరెడ్డి విష్ణువర్దన్ రెడ్డి కోరారు. బుధవారం ఓర్వకల్లులో టీడీపీ ముఖ్య నాయకుల ఇంటి దగ్గరకు వెళ్లి వారితో చర్చించారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్య క్షుడు మోహన్ రెడ్డి, నాయకులు స్వామిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, అబ్దుల్లా, అల్లాబాబు, కురువ జయన్న, కురువ సుంకన్న, యాసీన్‌బాషా, నాగరాజు, అలంబాషా, వందనాలు పాల్గొన్నారు.

'ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి'

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 3: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్విని యోగం చేసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని మౌర్య ఇన్‌లోగల పరిణయ ఫంక్షన్ హాలులో హిందూ సామాజిక, ధార్మిక, సేవ సంస్థల కార్య కర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజల్వన చేసిన సాయిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఉన్నత ఆశయాలు కలిగిన వ్యక్తులతోనే దేశం మరింత మహోన్నతంగా ఎదుగుతుందని అన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని, నోటుకు ఎవ్వరూ లోనుకాకుండదని అన్నారు. కార్యక్రమంలో లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్కిరెడ్డి అమరసింహారెడ్డి, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి.ప్రతాపరెడ్డి, రాష్ట్ర సహ కార్యదర్శి ఎస్ ప్రాణేశ్, రాష్ట్ర సేవా సహ ప్రముఖ్ పీవీ గురుమూర్తి, విభాగ్ బజరంగ్ దళ్ కన్వీనర్ నీలి నరసింహ, జిల్లా సహ కార్యదర్శులు ఈపూరి నాగరాజు, గోవింద రాజులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యం

టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు


నెల్లిబండలో పర్యటిస్తున్న బస్తిపాటి నాగరాజు

దేవనకొండ, ఏప్రిల్ 3 : రాష్ట్రం ప్రగతి పథాన నడవాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి పంచలింగాల బస్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం నెల్లిబండ గ్రామంలో సుంకులమ్మ, పెద్దమ్మవ్వ దేవర వేడుకలలో ఎంపీ అభ్యర్థి నాగరాజు పాల్గొని ఆలయాలలో ప్రత్యేకపూజలు చేశారు. గ్రామంలో పర్యటిస్తూ వచ్చే ఎన్నికలలో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో రాజధాని లేకుండా చేసిన పాపం వైసీపీదేనన్నారు. జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేసి సాగు, తాగునీరు కావాలంటే చంద్రబాబు రావాలన్నారు. టీడీపీ నాయకులు మల్లికార్జునగౌడ్, జనసేన నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరులో టీడీపీ జెండా ఎగరడం ఖాయం


విష్ణువర్ధన్ రెడ్డిని కలసి మద్దతు తెలుపుతున్న గూడూరు టీడీపీ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 3: టీడీపీకి వస్తున్న ప్రజాదరణ చూస్తుంటే కోడుమూరులో టీడీపీ జెండా ఎగరడం ఖాయమని గూడూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, కర్నూలు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి దండు సుందరరాజు అన్నారు. బుధవారం గూడూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, కర్నూలు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి దండు సుందరరాజు ఆధ్వర్యంలో గూడూరు నుంచి టీడీపీ శ్రేణులు కర్నూలులోని జిల్లా టీడీపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి స్వగృహానికి తరలివెళ్ళి కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి విజయానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, టీడీపీ అధ్యక్షుడు జె సురేష్, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్‌బాబు, రేమట వెంకటేష్, టీడీపీ కౌన్సిల ర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, సృజన్, నాగప్ప యాదవ్, తెలుగు శ్రీను, రహిమాన్, గిడ్డయ్య పాల్గొన్నారు.


అనధికార లేఅవుట్ తొలగింపు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 3: పెద్దపాడులో అనధికారింగా వేసిన లేఅవుట్‌ను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తొలగించారు. బుధవారం ఇన్‌చార్జి డీసీపీ సంధ్య పర్యవేక్షణలో ఏసీపీ రంగస్వామి సిబ్బందితో కలిసి ప్రహరీలను తొలగించారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ సర్వేనెంబరు 113, 137లో లేఅవుట్‌కు ఎలాంటి అనుమతులు లేవన్నారు. టీపీఓ శబరీష్ ఉన్నారు.

ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో బుధవారం బీ.క్యాంపు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కర్నూలు డివిజన్ ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం జరిగింది. ఈసందర్భంగా జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ విజయ జ్యోతి కుమారి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధిత వైద్యులతో స్కీనింగ్ టెస్టులు నిర్వహించి అలీమ్‌కో కంపెనీ ద్వారా కృత్రిమ అవయవాల కోసం రెఫర్ చేస్తామన్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన ఆర్థోపెడిక్ డాక్టర్ సాయిప్రశాంత్, ఈఎన్‌టీ శ్రీనిధి, సైక్రాయాటిస్టు చంద్రశేఖర్, ఆడియోలాజిస్టు సింధూరి ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్ర మంలో జిల్లా సమగ్ర శిక్షణ కోఆర్డినేటర్లు సాయిరాం, విజయప్రసాద్, భవిత కేంద్రాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్యారమ్స్ పోటీలకు లిఖితారెడ్డి



కర్నూలు(స్పోర్ట్స్), ఏప్రిల్ 3: మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు జరగబోయే 51వ జాతీయ సీనియర్ క్యారమ్స్ పోటీలకు కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారిణి వి.లిఖితారెడ్డి ఎంపికైనట్లు జిల్లా క్యారమ్స్ సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరాజు తెలిపారు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. లిఖితారెడ్డి ఇప్పటి వరకు ఏడు సార్లు జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది.

శ్రీశైలం పాద యాత్రికులకు పులిహోర ప్యాకెట్లు

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 3: ఉగాది సందర్భంగా శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులకు నగరంలోని హనుమాన్ కళా సమితి బుధవారం పులిహోర ప్యాకెట్లు అందజేసింది. కళా సమితి అధ్యక్షుడు పి. హనుమంతరావు చౌదరి, కోశాధికారి లక్ష్మీ పద్మాచౌదరి ఆధ్వర్యంలో నగరంలోని కొత్త బస్టాండు ప్రాంతంలో ఈ ఏర్పాటు చేశారు.

కంబందహాల్ మాజీ సర్పంచ్ మృతి

సి.బెళగల్, ఏప్రిల్ 3: మండలంలోని కంబందహాల్ గ్రామ మాజీ సర్పంచ్ దేవానందం(80) గత కొద్దిరోజుల నుంచి అనారోగ్యం బాధపడుతూ బుధవా రం సాయంత్రం మృతి చెందాడు. ఈయన 2006 నుంచి 2011 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. మృతుడికి భార్య శకుంతలమ్మ, నలుగురు కుమారులు, నలుగురు కూతుర్లు ఉన్నారు. ఈవిషయం తెలుసుకున్న మండల టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు ఆయన బౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

మార్గదర్శకాలను తప్పక పాటించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 3: పోలింగ్ విధులపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండటంతో పాటు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పోలింగ్ సిబ్బంది తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశించారు. బుధవారం పట్టణంలోని బాబు ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గానికి సంబంధించి బూత్‌లెవల్ స్థాయి, సెక్టోరియల్ అధికారులకు, ఎంసీసీ బృందాలకు సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి అవగాహన కల్పించేందుకు సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ రోజు బీఎల్‌ఓలు, సెక్టార్ ఆఫీసర్లు ఈవీఎంలను ఏవిధంగా కనెక్ట్ చేయాలి, ఎలా తొలగించాలి, మాక్‌పోల్ నిర్వహణ, మాక్‌పోల్ స్లిప్స్ నిర్వహణ, మాక్‌పోల్ క్లియర్ చేయటం, పోలింగ్ యంత్రాలపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోలింగ్ పూర్తయిన వెంటనే కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ మిషన్లు, స్లిప్స్, పీఓ డైరీ 17(సీ), పీఓ రిపోర్టుతో స్ట్రాంగ్‌రూంలో చేర్చేలా పోలింగ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్డీఏ కూటమికే మాదిగల మద్దతు

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 3: ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులకే రాష్ట్రంలో మాదిగల మద్దతు ఉంటుందని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సుభాష్‌చంద్ర మాదిగ అన్నారు. బుధవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం దేశవ్యాప్తంగా బీజేపీకి, రాష్ట్రంలో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని, తమ అధినేత మందకృష్ణ సూచించారన్నారు. టీడీపీ హయాంలో, అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణ చేసి, వేల మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 25 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు బండారి హనుమంతు, నాగప్ప, వీరేష్, మనోజ్, గిడ్డయ్య, బాలస్వామి, మణికంఠ, దత్తు, తిమ్మన్న పాల్గొన్నారు.

ఆదోని సీటు మైనార్టీలకే కేటాయించాలి

ఆదోని టౌన్, ఏప్రిల్ 3: మైనార్టీలు అధిక సంఖ్యలో ఉన్న ఆదోని అసెంబ్లీ స్థానాన్ని మైనారిటీ నాయకులకే కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఎండీ నూర్ అహమ్మద్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా అనేక సంవత్సరాలుగా పార్టీనే అంటిపెట్టుకొని, పార్టీ పురోభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకులకు అవకాశం కల్పించాలని కోరారు. కర్నూలు పార్లమెంట్ స్థానంతో పాటు కోడుమూరు అసెంబ్లీ స్థానానికి పోటీ చేయడానికి ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన నాయకులకు అవకాశం కల్పించారని, ఇదీ ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఏపీ ఇన్‌చార్జి రఘువీరా రెడ్డి, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పార్టీ టికెట్లను అమ్ముకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయని అన్నారు.

బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలి

ఆదోని రూరల్, ఏప్రిల్ 3 : ఉపాధి కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన లక్ష్మీ కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని సీపీఎం నాయకులు లింగన్న, రామాంజనేయులు, తిక్కప్ప అన్నారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను సీపీఎం నాయకులు పరామర్శించారు. గ్రామంలో పనులు లేకపోవడంతోనే మృతురాలు లక్ష్మీ పొటకూటి కోసం మిరప కోత కోయడానికి వెళ్తూ ఆటో ప్రమాదంలో మృతి చెందిందని, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు.

అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

తుగ్గలి, ఏప్రిల్ 3: ఓటు వజ్రాయుధం లాంటిదని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. బుధవారం తుగ్గలి, మామిళ్లకుంట, శభాష్‌పురం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ తేదీకి ముందురోజే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. ఆర్డీవో వెంట తుగ్గలి తహసీల్దార్ షర్మిళ, ఆర్ఐ సుధాకర్ రెడ్డి, వీఆర్వోలు రెహమాన్, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

లారీ, ద్విచక్రవాహనం ఢీ -వ్యక్తికి గాయాలు

తుగ్గలి, ఏప్రిల్ 3: ఎదురుగా వస్తున్న లారీని ద్విచక్రవాహనం ఢీకొనడంతో పక్కీరప్ప అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం జొన్నగిరి గ్రామ శివారులో బోడిబండ పక్కీరప్ప స్వామి పూజారి పక్కీరప్ప, ఆయన కుమారుడు గురుస్వాములు ద్విచక్రవాహనంపై పత్తికొండకు వెళ్తూ. కుక్క అడ్డుగా రావడంతో తప్పించబోయి.. ఎదురుగా ఉల్లిగడ్డల లోడుతో వస్తున్న లారీని ఢీకొనడంతో పక్కీరప్పకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని హుటాహుటిన గుత్తి వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జొన్నగిరి ఎస్ఐ బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు పక్కీరప్ప స్వామి ఆలయ ధర్మకర్త అప్పా వేణుగోపాల్ క్షతగాత్రుడ్ని పరామర్శించి వారి కుటుంబాలకు అండగా ఉంటామని, వైద్యచికిత్సలు తామే చేయిస్తామని హామీ ఇచ్చారు.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి

ఆదోని, ఏప్రిల్ 3: ప్రచారానికి నిర్దేశించిన విధంగా అనుమతి తీసుకోవాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో రాజకీయ పార్టీలు ఎన్నికల మీటింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు, రాష్ట్రస్థాయికి సంబంధించిన పోస్టర్లు కానీ, వీడియో వెహికల్ గాని, సీఈవోచే పర్మిషన్ తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ప్రచారానికి నిర్వహించి వీడియో వెహికల్‌కు, హెలిప్యాడ్స్‌కు, ఎయిర్ బెలూన్స్‌కు, సంబంధించిన అనుమతులు పొందాలన్నారు. లోకల్ మీటింగ్స్, ర్యాలీలు, ప్రచారాలకు అనుమతులు పొందవచ్చని పేర్కొన్నారు.

మండుటెండలో పడిగాపులు

- పింఛన్ కోసం వృద్ధుల ఇబ్బందులు
- మాకెందుకీ కష్టాలు అంటూ ఆవేదన
- 800 మంది లబ్ధిదారులకు 10 మంది అధికారులు ఇళ్లకు వెళ్లి ఇవ్వలేరా..?



కౌతాళంలో సచివాలయం-2వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు)



పింఛన్ కోసం ఆదోనిలోని 22వ సచివాలయానికి వచ్చిన దివ్యాంగుడు నాగరాజు



పెన్షన్ కోసం ఎండలో వచ్చి కళ్లు తిరిగి కింద కూర్చున్న శేఖున్ బీ

ఆదోని, ఏప్రిల్ 3: ఏప్రిల్ 3వ తేదీ వచ్చిన పించనుదారులకు ప్రభుత్వం నగదు అందించడంలో పూర్తిగా విఫలమవడంతో లబ్ధిదారులు తల్లడిల్లుతున్నారు. ముఖ్యంగా వృద్ధాప్య పింఛన్ కోసం పండుటాకులు లాంటి వృద్ధులు మండుటెండలో పడిగాపులు కాశారు. ఆదోని పట్టణంలోని 22 సచివాలయంలో ఉదయం నుంచే వృద్ధులు పింఛన్ కోసం తరలివచ్చారు. లబ్ధిదారులు క్యూలైన్లలో నిల్చుని ఎదురుచూశారు. చాలాచోట్ల సచివాలయాలకు ఇంకా పింఛన్ డబ్బు చేరుకోకపోవడంతో లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. 2,3 గంటల పాటు లైన్లలో నిలుచున్న వృద్ధులు ఎండవేడికి తట్టుకోలేక ఇళ్లకు తిరిగి వెళ్లిపోయారు. ఎప్పటిలా ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తే ఇలాంటి ఇబ్బందులు ఉండేవి కాదని ఆవేదన చెందుతున్నారు. 22వ సచివాలయంలో దాదాపు పదిమంది సిబ్బంది ఉన్నారు. 803 పెన్షన్‌దారులు ఉండగా. పదిమంది అధికారులకుగాను, ఒక్కో అధికారికి 80మంది పెన్షన్ లబ్ధిదారులు ఉంటారు. అయితే అధికారులు మాత్రం సచివాలయంలోని ఫ్యాన్ కింద కూర్చుని పెన్షన్ను పంపిణీ చేశారు. ఈ సచివాలయంలో 29 మంది వలంటీర్లు ఉండగా, సరాసరి ఒక్కొక్కరు 25 మందికి మాత్రమే పెన్షన్ పంపిణీ చేసేవారు. సచివాలయం అధికారులు మాత్రం వారు ఎలాంటి వారైనా సరే సచివాలయానికి వచ్చి తీసుకెళ్లాల్సిందే అంటూ హుకుం జారీ చేయడంతో, తప్పని పరిస్థితుల్లో వికలాంగులు, నడవలేని వారు సైతం శాపనార్థాలు పెడుతూ సచివాలయాలకు చేరుకున్నారు. వేలిముద్రలు పడక.. మరోవైపు ఎండల వేడిమి తాళలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి క్యూలో నిల్చోలేకపోయారు. కనీసం మంచి నీరు కూడా ఏర్పాటు చేయలేదంటూ పలువురు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగులు, అంధుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని వృద్ధులు వాపోయారు. ఒక అధికారికి 80 మంది ప్రకారంగా పదిమంది ఇళ్లకు వెళ్లి ఇవ్వచ్చు కదా.. అంటూ సచివాలయ సిబ్బందిపై పెన్షన్‌దారులు తిరగబడ్డారు.

కౌతాళం, ఏప్రిల్ 3: మండలంలో ఏప్రిల్ 3వ తేదీ వచ్చిన పించనుదారులకు ప్రభుత్వం నగదు అందించడంలో పూర్తిగా విఫలమవడంతో పించనుదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో సుమారు 8760 మంది పించనుదారులు ఉండగా బుధవారం వరకు పించను అందకపోవడంతో వృద్ధులు, వికలాంగులు అవస్థలు పడ్డారు.

ఆలస్యంగా ప్రారంభమైన పింఛన్ల పంపిణీ

మంత్రాతాలయం/ఎమ్మిగనూరు 3: మంత్రాలయం, ఎమ్మిగనూరు పట్టణంలో బుధవారం సామాజిక పింఛన్ పంపిణీ గంటకుపైగా ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో ఆయా సచివాలయాల్లో పెన్షన్‌కోసం వేచి ఉండలేక మహిళలు వృద్ధులు ఇబ్బంది పడ్డారు. వాస్తవంగా మధ్యాహ్నం 3 నుంచి పింఛన్ల పంపిణీ జరుగుతుందని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, బ్యాంకుల నుంచి డబ్బు రాకపోవటంతో గంట, గంటన్నర ఆలస్యంగా పింఛన్ల పంపిణీ ప్రాంభించారు. సచివాలయాల దగ్గరకు లబ్ధిదారులు వచ్చి పోతూ కనిపించారు. స్థానిక మార్కెట్ సర్కిల్‌లో పై అంతస్తులో ఉన్న సచివాలయాల్లోకి వృద్ధులు ఎక్కేందుకు అవస్థ పడ్డారు.

ఇంటి వద్దనే పింఛన్ అందించాలి

టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల డిమాండ్

హొళగుంద, ఏప్రిల్ 3: సచివాలయం సిబ్బంది సహకారంతో పింఛన్లు ఇంటి వద్దనే లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎంపీడీవో ఆజాద్‌ను కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పింఛన్ డబ్బు సకాలంలో ఇవ్వకుండా రాజకీయం చేస్తూ, వృద్ధులను వితంతులను, దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. టీడీపీపై బురద జల్లే ప్రయత్నం మానుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ తిప్పయ్య, బీజేపీ నాయకుడు ఈడిగ ప్రసాద్, మాజీ మండల కన్వీనర్ వీరన్న గౌడ్, మైనార్టీ నాయకుడు ఆదాం, తోక వెంకటేష్, కుమార్ పాల్గొన్నారు.



హొళగుందలో ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న కూటమి నాయకులు

టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరు



ప్రచారం నిర్వహిస్తున్న రాఘవేంద్ర రెడ్డి,



మన ప్రభుత్వం వస్తే కులవృత్తుల వారిని ఆదుకుంటామని భరోసా ఇస్తున్న రాఘవేంద్రరెడ్డి

- టీడీపీ మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి
- కౌతాళంలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం

కౌతాళం, మార్చి 3: రాష్ట్రంలో అధికార పార్టీ దౌర్జన్యాలు, అక్రమాలతో ప్రజలు విసిగిపోయారని త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఎవరూ ఆపలేరని టీడీపీ మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో బుధవారం ఇంటింటి ఎన్నికల ప్రచారకార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు ఉలిగయ్యతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధికంగా బీసీ ఓటర్లు ఉన్నారని వారిని రాజకీయంగా ఎదిగేందుకు నారా చంద్రబాబునాయుడు తనకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. తనను ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధితో పాటు వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళికలు చేపడతానని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు సురేష్‌నాయుడు, సతీష్ నాయుడు, జనసేనా నాయకుడు రామాంజనేయులు, బీజేపీ నాయకుడు ఈరన్న, నాయకులు నీలకంఠరెడ్డి, కురువ వీరేష్, కృష్ణకాంత్, శ్రీరాములు, బుడుదొడ్డి ఉన్నారు.

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం : వీరభద్రగౌడ్

ఆలూరు, ఏప్రిల్ 3: చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా పెట్టుకొని ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి ఆలూరులో టీడీపీ జెండా ఎగరవేద్దామని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం నియోజకవర్గం నుంచి వీరభద్రగౌడ్‌ను కలిసేందుకు నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అన్ని వర్గాల సహకారంతో, సీనియర్ నేతల సలహాల మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వ ఆగడాలను ఎండగట్టి, ప్రజల్లో చైతన్యం తీసుకు వస్తామన్నారు. టీడీపీ జిల్లా నాయకులు నరసప్ప, భాస్కర్, నాగరాజు, కొమ్ము రామాంజనేయులు, మండల నాయకులు దేవేంద్ర, రాముడు, చంద్ర, శేఖర్, గోవింద్ పాల్గొన్నారు.



వీరభద్ర గౌడ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పరిస్థితులను అధిష్టానానికి వివరిస్తాం

- టీడీపీ రాయలసీమ జోన్ ఇన్‌చార్జి బీద రవిచంద్రయాదవ్, జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



టీడీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న బీద రవిచంద్రయాదవ్

మంత్రాలయం, ఏప్రిల్ 3: నియోజకవర్గంలో మెజారిటీ టీడీపీ నాయకులు తిక్కారెడ్డి నాయకత్వాన్నే కోరుకుంటున్నారని, ఈ విషయాన్ని రాష్ట్ర అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని టీడీపీ జోన్-5 కోఆర్డినేటర్ బీద రవిచంద్రయాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మెజారిటీ సభ్యులు నియోజకవర్గంలో పలు నివేదికల ప్రకారం తిక్కారెడ్డినే టీడీపీకి కావాలని కోరుకుంటున్నారని, దీనిపై టీడీపీ అధిష్టానానికి ఇక్కడ జరుగుతున్న పరిణామాలను చర్చించి మార్పునకు పునరాలోచన చేస్తామని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయమే తుది నిర్ణయంగా ఉంటుందని, టీడీపీని నమ్ముకున్న వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా తీర్మానంచేసి రవిచంద్రయాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. సమావేశంలో కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవకుమార్, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్‌స్వామి, పూజారి వ్యాసరాజాచార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యం

టీడీపీ ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు



నెల్లిబండ గ్రామంలో పర్యటిస్తున్న పంచలింగాల నాగరాజు

దేవనకొండ ఏప్రిల్ 3 : రాష్ట్రం ప్రగతి పథాన నడవాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి పంచలింగాల బస్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం నెల్లిబండ గ్రామంలో సుంకులమ్మ ,పెద్దమ్మవ్వ దేవర వేడుకలలో ఎంపీ అభ్యర్థి నాగరాజు పాల్గొని ఆలయాలలో ప్రత్యేకపూజలు చేశారు. గ్రామంలో పర్యటిస్తూ వచ్చే ఎన్నికలలో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో రాజధాని లేకుండా చేసిన పాపం వైసీపీదేనన్నారు. జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేసి సాగు, తాగునీరు కావాలంటే చంద్రబాబు రావాలన్నారు. టీడీపీ నాయకులు మల్లికార్జునగౌడ్, జనసేన నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తాలుకా దూదేకుల సంఘం అధ్యక్షుడిగా బషీర్

మద్దికెర, ఏప్రిల్ 3 : మండలంలోని హంపా గ్రామానికి చెందిన కొలికి బషీర్ అహ్మద్‌ను నియోజకవర్గం దూదేకుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు బుధవారం దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ సయ్యద్ బాజీ ఉత్తర్వులు పంపారు. ఈ సందర్భంగా బషీర్ అహ్మద్ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం దూదేకులకు రాజకీయ గుర్తింపునివ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపికైన బషీర్‌ను సన్మానించారు.

ఎన్‌సీసీ విద్యార్థినులకు స్కాలర్‌షిప్

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 3: పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు ఎన్‌సీసీ విద్యార్థినులు 9 ఆంధ్ర బెటాలియన్ సిడబ్ల్యూఎస్ కింద స్కాలర్షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం అలీమ్ సిద్దికి, ఎన్‌సీసీ ఆఫీసర్ పరిమళ తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థునులకు ఒక్కొక్కరికి రూ.6000 చెక్కును అందజేసి అభినందించారు.

వాహనాలు సీజ్

మద్దికెర, ఏప్రిల్ 3 : మండలంలో ఆటోలు, బొలేరోలు, టాటా ఏసీలు కూలీలు కెపాసిటికి మించి తరలించిన రెండు వాహనాలను సీజ్ చేశామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. బుధవారం మద్దికెర నుంచి ఇతర ప్రాంతాలకు మిరప కోతల కోసేందు కోసం లెక్కకు మించి కూలీలను ఆటోల్లో తరలిస్తుండగా ఎస్ఐ రమేష్ బాబు పట్టుకుని వాహనాలను వెనక్కు పంపారు. రెండు వాహనాలను సీజ్ చేసి ఆర్టీవో కార్యాలయానికి రెఫర్ చేయగా ఆర్టీవో ఒక వాహనానికి రూ.11,500 జరిమానా, ఇంకో ఆటోకు రూ.1000 జరిమానా విధించినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ పని వేళల్లో మార్పు

మద్దికెర, ఏప్రిల్ 3 : పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాల్లో పని వేళలు మార్పు చేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు నేటి నుంచి మే 31 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే కేంద్రాలు పని చేస్తాయన్నారు. మే 1 నుంచి 15వ తేదీ వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, మే 16 నుంచి 30 వరకు సహాయకులకు వేసవి సెలవులు ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

రేపు పత్తికొండకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 2: స్థానిక అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న ఇండియా కూటమి అభ్యర్థి రామచంద్రయ్య విజయాన్ని కాంక్షిస్తూ ఈ నెల 5న పత్తికొండలో జరుగుతున్న సీపీఐ జనరల్‌బాడీ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరవుతారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. బుధవారం స్థానిక సీఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీపీఐ జనరల్ బాడీ సమావేశం 5వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక సీఆర్ భవన్‌లో జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాబురావు, ఇండియా కూటమి పార్లమెంటు అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్, పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి రామచంద్రయ్య హాజరవుతారని పేర్కొన్నారు. కేంద్రంలో మతతత్వ బీజేపీ నుంచి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు అంతం పలికేందుకు ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పత్తికొండ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం, సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్యను ఆదరించి గెలిపించాలని కోరారు. మండల కార్యదర్శి రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు కృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మరో మహిళ మృతి

మద్దికెర, ఏప్రిల్ 3 : మద్దికెర గ్రామ శివారులో మార్చి 31న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ కురువ లక్ష్మీదేవి (35) అనే మహిళ కోలుకోలేక బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. మార్చి నెల 31న చిప్పగిరి మండలంలో మిరపకాయలు తెంచేందుకు కూలీలు ఆటోను అద్దెకు తీసుకుని పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతి చెందగా.. మరో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో కురువ లక్ష్మీదేవి అనే మహిళా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కురువ లక్ష్మీదేవికి భర్త కురువ మల్లేష్‌తో పాటు కుమారుడు, కే.వినయ్, కూతురు కె.వినిత ఉన్నారు. ఎస్ఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలు



కేఈ శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

వెల్దుర్తి, ఏప్రిల్, 3 : మదార్‌పురం గ్రామంలో బుధవారం టీడీపీ పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ.శ్యాంబాబు సమక్షంలో 30 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీ మాజీ సర్పంచు మల్లిఖార్జున, మనోహర్ ఆధ్వర్యంలో ఉపసర్పంచు బోయ రమేష్, బోయ మురళీ, బోయ మధు, గొల్లరాజేష్, గొల్ల జగదీష్, గొల్ల శ్రీకాంత్, బోయ సుజాత, బోయ ఎల్లమ్మ, బోయ అనురాధ, బోయ పెద్దబాబు, బోయ ఆంజనేయులు 15 కుటుంబాలు పార్టీ కండువాలు కప్పుకొని తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, జయరాముడు, సుధాకర్‌గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలాగే పట్టణంలో టీడీపీ నాయకులు రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 14వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ టీడీపీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రజలకు అవగాహన కల్పించారు.

ఉపాధి కూలిని రూ.300కు పెంచాలి

మంత్రాలయం, ఏప్రిల్ 3: నియోజకవర్గంలో ఉపాధి కూలీలకు రూ.300 పెంచి చలువ పందిల్లు వేసి, చల్లని పానియాలు అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి భాస్కర్ యాదవ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో మునెప్పను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎండలు మండుతున్నా.. ఎండల్ని లెక్క చేయకుండా కూలీ పనుల కోసం చేస్తున్న వారికి మజ్జిగ, చల్లనీ తాగునీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. సచివాలయాల్లో ఉద్యోగులు సక్రమంగా రావడం లేదని పేర్కొన్నారు. సీపీఐ నాయకులు గోపాల్, గాబ్రియేలు, ఎస్.రాజు, బండప్ప, నీలకంఠప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చుక్కెదురు

వెల్దుర్తి, ఏప్రిల్, 03 : ఇంటింటి ప్రచారంలో పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవికి స్థానిక ప్రజల నుంచి చుక్కెదురైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. రత్నపల్లె గ్రామంలో ప్రజలు నీటి సమస్యతో సతమతమవుతున్నామని పరిష్కరించాలని బీసీ కాలనీ వాసులు, ఎస్సీ కాలనీ వాసులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. అదేవిధంగా రోడ్లు కూడా సరిగా లేవని తెలియజేశారు. అలాగే కరువుపనిలో తమ పేర్లు లేవని కరువు పని పెట్టడం లేదని వాపోయారు. తీర్మానాలు లేకుండా పనులు చేయిస్తూ ఫీల్డు అసిస్టెంట్లు పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

గోనెగండ్ల, ఏప్రిల్ 3: తిప్పనూరు గ్రామ సమీపంలోని బ్రిడ్జ్ దగ్గర అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి ట్రాక్టర్ యజమాని పై కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. తిప్పనూరు గ్రామ బ్రిడ్జి దగ్గర బుధవారం కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన సందుల రాముడు అనే యువకుడు ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేశామని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆస్పరి, ఏప్రిల్ 3: మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆలూరు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాము నాయక్ బుధవారం పరిశీలించారు. చిన్నహోతూర్ నుంచి ములుగుందం వరకు ఉన్న పోలింగ్ కేంద్రాలను సీఐ హనుమంతప్ప, తహసీల్దార్ ఈరమ్మ పరిశీలించారు. ఆస్పరి, బిల్లేకల్, ముత్తుకూరు, వలగొండ, కైరుప్పల, కారుమంచి, ములుగుందం గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నామని పేర్కొన్నారు.